సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 22 । ఏప్రిల్ । 2023

న్యూస్‌రీల్

బోరు పాడైతే సర్పంచే సరిచేస్తారు



కొత్తాడలో బోర్లు రిపేర్ చేస్తున్న సర్పంచ్ కామరాజు (ఎడమ)

గంగవరం : నేర్చుకున్న విద్య ఉంటే ఏదో విధంగా ఉపయోగపడుతుంది. గంగవరం మండలం కొత్తాడ సర్పంచ్ శారపు కామరాజుదొర 2007లో పొందిన బోర్ల రిపేర్ల శిక్షణ నేడు ఉపయోగపడుతోంది. తమ గ్రామంలో పాడైన మంచినీటి బోర్లకు ఆయనే స్వయంగా మరమ్మతులు చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కొత్తాడ పునరావాస కాలనీలో పలు చోట్ల పాడైన మంచినీటి బోర్లను గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో సర్పంచ్ రిపేర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో ఐటీడీఏ ద్వారా మారేడుమిల్లి వైటీసీలో బోర్ల రిపేర్లపై శిక్షణ పొందానని, గ్రామంలో ఏదైనా బోర్లు చెడిపోతే తానే మరమ్మతులు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సీలేరు: సీలేరు గ్రామ దేవత మారెమ్మ ఆలయంలో శుక్రవారం ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా తిరుమలగిరి కార్యనిర్వహణ అధికారి ప్రసాద్ సాయంతో ఈ పూజలు నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ, హోమం నిర్వహించినట్టు అర్చకుడు దామోదరం తెలిపారు. శనివారం గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, ఆదివారం అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రవాహ ఉధృతికి దెబ్బతిన్న బ్రిడ్జి పిల్లర్



దెబ్బతిన్న బ్రిడ్జి పిల్లర్ అడుగుభాగం


మోతుగూడెం: ఒడియా క్యాంపు వద్ద పవర్ కెనాల్ బ్రిడ్జి స్పియర్ నీటి కోతకు గురై రాళ్లు జారిపోవడంతో దెబ్బతింది. శుక్రవారం కెనాల్‌లో నీటి ప్రవాహం తగ్గడంతో స్పియర్‌కు డ్యామేజ్ జరిగినట్లు గుర్తించామని ఏపీ జెన్‌కో ఈఈ బాబూరావు తెలిపారు. దీంతో హుటాహుటిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినట్టు ఆయన వివరించారు. శనివారం ఉదయం నుంచి పనులు ప్రారంభిస్తామని, రెండు రోజుల్లో డ్యామేజ్ జరిగిన ప్రాంతంలో కాంక్రీట్ పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

'యెకొహామా'లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డతీగల: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ శాఖ సహకారంతో యెకొహామా ఆఫ్ హైవే టైర్లు కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ అర్హత గల వారు ఉద్యోగాలకు అర్హులన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం నెలకు రూ.15 వేల వేతనం ఇస్తారన్నారు. అభ్యర్థులు 18 నుంచి 24 సంవత్సరాల లోపు వారై ఉండాలన్నారు. మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాడేరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఉద్యోగాలు చేయవలసి ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా ఇస్తామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9014767230 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కోవిడ్ కేసులు తగ్గుముఖం

రాజవొమ్మంగి: మండలంలో దాదాపు నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో నమోదు అయిన కోవిడ్ కేసులు శుక్రవారం కాస్త తగ్గు ముఖం పట్టాయి. రాజవొమ్మంగి పీహెచ్‌సీలో 13 మందికి పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి మాత్రమే పాజిటివ్ వచ్చిందని డాక్టర్ లిఖిత తెలిపారు. కాగా లాగరాయి పీహెచ్‌సీలో ముగ్గురికి, జడ్డంగి పీహెచ్‌సీలో ముగ్గురుకి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా పాజిటివ్ నమోదు కాలేదని వైద్యాధికారులు రవీంద్ర ఏచూరి, సుజి తెలిపారు. అయినా ప్రతి ఒక్కరు కోవిడ్ నిబంధనలు పాటించాలని, తప్పకుండా ముఖానికి మాస్క్ ధరించాలని వారు సూచించారు. సబ్బు ఉపయోగించి చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



చింతూరు ప్రాంతంలో కనిపించిన నెలవంక



రాజవొమ్మంగిలో రంజాన్‌కు ముస్తాబైన మసీదు

మానవాళి సంతోషమే రంజాన్

- నేడు పండగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన మసీదులు
- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు

చింతూరు: జిల్లాలో రంజాన్ పండగ ఘనంగా నిర్వహించేందుకు మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజులుగా కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిం సోదరులకు శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనంతో శనివారం ఈదుల్‌ఫితర్ (రంజాన్) పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ముస్లింలకు ఆరాధ్యమైన దివ్య ఖురాన్ ఈ మాసంలోనే అవతరించడంతో రంజాన్ పండగకు ఇంత ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ నెలంతా వారు ఎంతో కఠోర దీక్షతో ఉపవాసాలు (రోజా) ఆచరించడంతో పాటు నెల రోజుల పాటు రాత్రుళ్లు తూచా తప్పకుండా తరావీ నమాజును ఆచరించారు. చివరి పది రోజుల్లో ఐదు రాత్రులు జాగారం ఉండి తమ ఉపవాస దీక్షలను పూర్తిచేశారు. నెలవంక కనబడడంతో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్‌తో ఉపవాస దీక్షలు, తరావీ నమాజు పూర్తయినట్లు ఇమాం ప్రకటించారు. సమాజంలోని పేదవారు సైతం తమతో పాటు ఆనందంగా పండుగ జరుపుకునేలా ఫిత్రా (గోధుమలు, నగదు) దానం చేశారు.

ఈదుల్‌ఫితర్ జరుపుతారిలా..

నెలవంక కనబడిన మరుసటి రోజున ముస్లిం సోదరులు ఈదుల్‌ఫితర్ (రంజాన్) పండగను జరుపుకుంటారు. ఉదయమే ఇంటిల్లిపాది స్నానాలు చేసి కొత్త బట్టలు వేసుకుంటారు. పురుషులు సమీపంలోని ఈద్గాలకు లేదా మసీదులకు వెళ్లి రెండు రకాతుల 'ఈదుల్‌ఫితర్' నమాజు చేస్తామని ముస్లింలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతగురువులు చెప్పే ఖురాన్ సందేశాలను భక్తితో ఆలకించిన అనంతరం వారంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. చివరగా ముస్లిం సోదరులు తమ ఇళ్లలో సేమియా పాయసం స్వీకరించడంతో రంజాన్ పండగ ముగుస్తుంది.



రంజాన్‌కు సిద్ధమైన చింతూరు మసీదు

- రంపచోడవరంలోని మక్కా మసీదు, చింతూరులోని మస్జిదే యాసీన్‌తో పాటు అన్ని మండల కేంద్రాల్లోని మసీదుల్లో ముస్లింలు శనివారం రంజాన్ నమాజును ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఈద్గాల్లో కూడా నమాజు ఆచరించేందుకు ఈద్గాలను సిద్ధం చేశారు.
- మార్కెట్లలో కొనుగోళ్లతో రంజాన్ సందడి నెలకొంది. పండగ సందర్భంగా ముస్లింలు ప్రధానంగా దుస్తులు, టోపీలు, సెంటు, సుర్మాతో పాటు సేమ్యా, జీడిపప్పు, కిస్మిస్ కొనుగోలు చేశారు.



పాడేరులో విద్యుత్ దీపాలంకరణలో మసీదు

విద్యుత్ దీపాలతో ముస్తాబు

సాక్షి,పాడేరు: పాడేరు, అరకులోయ, హుకుంపేట, గుత్తులపుట్టు, డుంబ్రిగుడ, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లోని మసీదులు రంజాన్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దీక్షలు, నమాజుతో సామరస్యం



ప్రతీ ముస్లింకు శుభాలను సమకూర్చే రంజాన్ మాసం ముగిసింది. దివ్య ఖురాన్ అవతరించిన నెల కావడంతో ఈనెలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. తమలోని చెడు అలవాట్లను త్యజించి నైతిక విలువలు పెంపొందించుకునేందుకు ఈ మాసం ఎంతో ఉపయోగ పడుతుంది. ఉపవాస దీక్షలు, నమాజులు ఆచరించడం వల్ల ప్రేమ, శాంతి, సామరస్యం అలవడుతుంది.

– ఎండీ ఎజాజ్ అహ్మద్, మసీదు ఇమాం, చింతూరు

గంజాయి కేసులో ఎస్‌ఐ పరారీ?

చింతూరు: గంజాయి కేసుతో ప్రమేయమున్న చింతూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ ఎస్‌ఐ శుక్రవారం పోలీసుల కళ్లుగప్పి పరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల నెల్లూరులో గంజాయితో వెళుతున్న కారు ఎస్‌ఈబీ అధికారులకు పట్టుబడింది. తమ వద్ద చింతూరు సబ్ డివిజన్‌కు చెందిన సదరు ఎస్‌ఐ సొమ్ము తీసుకున్నట్లు విచారణలో గంజాయి నిందితులు వెల్లడించినట్లు తెలిసింది. దీనిపై వారు రంపచోడవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం అక్కడి పోలీసుల బృందం వచ్చి చింతూరు నుంచి సదరు ఎస్‌ఐను రంపచోడవరం పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లగా అక్కడి నుంచి ఆయన పోలీసుల కళ్లుగప్పి పరారైనట్లు ప్రచారం జరుగుతోంది. పరారైన ఎస్‌ఐ ఆచూకీ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎస్పీ తుహిన్ సిన్హాను వివరణ కోరగా గంజాయి కేసుకు సంబంధించి విచారణ నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఆయన వివరించారు.

ఆరు నెలల ముందుగానే పెన్షన్ ప్రతిపాదనలు





పెన్షన్ అదాలత్‌కు హాజరైన డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బానోతి రాకేష్ నాయక్, కిశోర్‌రెడ్డి (ఇన్‌సెట్)అర్జీ స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు

- సమర్పించాలని సూచన
- డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బానోతి రాకేష్ నాయక్, కిశోర్‌రెడ్డి

పాడేరు రూరల్ : పెన్షన్ ప్రతిపాదనలను ఆరు నెలల ముందే పంపించాలని, వాటిని మూడు నెలల ముందే అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బానోతి రాకేష్ నాయక్, కిశోర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పెన్షన్ అదాలత్ నిర్వహించారు. పెన్షన్ ప్రతిపాదనలకు తప్పనిసరిగా పార్ట్–1,పార్ట్–2బీ శాంక్షన్ ఆర్డర్, మరణ, కుటుంబ ధ్రువపత్రాలను తప్పనిసరిగా జతచేయాలని సూచించారు. సర్వీస్ రిజిస్టర్ అత్యంత ముఖ్యమన్నారు. నియామకపు ఎంట్రీ , కుటుంబ సభ్యుల వివరాలు, ఇంక్రిమెంట్, లీవ్ ఎంట్రీలు తప్పనిసరిగా నమోదు అయింది లేనిదీ చూసుకోవాలన్నారు. సరైన జీపీఎఫ్ నంబర్ ఎస్‌ఆర్‌లో పొందుపర్చాలని సూచించారు. జీపీఎఫ్‌లో భాగంగా నామినేషన్లు, ఫైనల్ విత్‌డ్రా, మిస్సింగ్ క్రెడిట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పెన్షన్ ప్రతిపాదనలు పంపించేటప్పుడు సంబంధిత అధికారులతోపాటు డ్రాయింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అందిన వినతుల్లో కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రెజరీస్ అధికారులు ఎస్. మోహన్‌రావు, సీనియర్ అకౌంట్స్ అధికారులు టి.విజయ్‌కుమార్, డి. చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేడ్కర్, జిల్లా ట్రెజరీ అధికారి ప్రసాద్‌బాబు, రంపచోడవరం సబ్ ట్రెజరీ అధికారి కె. సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

సాక్షి,పాడేరు: పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ కోరారు. పీఎంఈజీపీ పథకంలో గిరి యువకుడు నగేష్‌కు మంజూరైన వాహనాన్ని ఆయనతోపాటు ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకంలో 35 శాతం సబ్సిడీ కాగా మిగతా 65శాతం రుణాన్ని వాయిదాల రూపంలో చెల్లించవచ్చన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ఈ వాహనాన్ని ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనధన్ మార్టులకు ఉపయోగించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. డ్రైవింగ్ శిక్షణ కలిగి ఉన్న నిరుద్యోగులంతా వాహనాలు పొందేందుకు పరిశ్రమలశాఖను సంప్రదించాలని కోరారు. డీఆర్వో అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ మురళి, పరిశ్రమలశాఖ ఏడీ నవీన్ పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న జేసీ శివశ్రీనివాస్, పీవో అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ముత్యాలమ్మ జాతర విజయవంతం

ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: ముత్యాలమ్మ జాతర విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.ఈ నెల 17 నుంచి ప్రారంభమైన ముత్యాలమ్మ జాతర గురువారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడారు. జాతర విజయవంతంలో స్థానికులు, అధికారులు, పోలీసుల పాత్ర ఎంతో ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్
- ఐటీడీఏ స్పందనలో 110 వినతుల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్పందనలో స్వీకరించే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ ఆదేశించారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేడ్కర్‌తో కలిసి ఆయన శుక్రవారం స్థానిక ఐటీడీఏలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి 110 వినతులను గిరిజనుల నుంచి స్వీకరించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటనలు జరపాలని జేసీ, ఐటీడీఏ పీవోలు ఆదేశించారు. కోర్టు కేసులు, రిట్ పిటిషన్లకు సంబంధించిన అంశాలపై జిల్లా అధికారులంతా ప్రత్యేకశ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఐటీడీఏ ఏవో హేమలత, పలు ఇంజనీరింగ్ శాఖల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, వేణుగోపాల్, లావణ్యకుమార్, లీలాకృష్ణ, జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖాధికారులు నందు, రమేష్‌కుమార్, కాఫీ ఏడీ అశోక్, డీఎల్పీవో పి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- చెక్‌డ్యామ్ నిర్మించి, వ్యవసాయ భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని పాడేరు మండలం గొండెలి పంచాయతీ లింగాపుట్టు గిరిజనులు పలాసి సింహాచలం, ఎస్.సోమరాజుల విన్నవించారు
- పాడేరు మండలం ముల్లుమెట్టపాఠశాలకు ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించాలని తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పి.అమ్ములు,కె.రంభ వినతిపత్రం అందజేశారు.
- పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ చింతగరువలో పాతకాలువపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కె.నాగరాజు, కొర్రా బొంజునాయుడు విన్నవించారు
- పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ చాపగెడ్డ గ్రామం నుంచి పనుగురాయి గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని ఎంపీటీసీ గడుతూరి నిర్మల కోరారు.
- రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉషశ్రీ డిప్యుటేషన్ రద్దు చేసి యథాతథంగా లాగరాయి పీహెచ్‌సీలోనే నియమంచాలని లాగరాయి, కింద్ర, కిర్రాబు, లబ్బర్తి గ్రామాలకు చెందిన ఈరే రాజబాబు, శ్రీను, బాలకృష్ణ, వజ్రాపు అప్పారావు వినతి పత్రంలో పేర్కొన్నారు.
- రంపచోడవరం డివిజన్ పరిధిలోని గంగవరం మండలం సూరంపాలెం పంచాయతీ, దొనెలపల్లి గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని సర్పంచ్ బి.శివదొర తదితరులు విన్నవించారు.
- పెదబయలు మండలం పెదకొడాపల్లి పంచాయతీ గొచ్చరి, డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ పులుగుడ గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని కొర్రా రామన్న, మర్రి లక్ష్మయ్య, జి.రాంబాబు, కె.కొండ వినతి పత్రంలో పేర్కొన్నారు.



స్పందనలో గిరిజనులు నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు

విరబూసిన పాల సంపంగి



మన్యంలో ప్రకృతి అందాలతో పాటు సీజన్లవారీగా అద్భుత దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి. మండలంలోని తీగలవలస పంచాయతీ కేంద్రంలో ఓ గిరిజనుడు ఇంటివద్ద పాలసంపంగి చెట్టు పూలతో విశేషంగా ఆకట్టుకుంటోంది. - హుకుంపేట

విశాఖకు ఉజ్వల భవిత

పారిశ్రామికవేత్తలతో ముఖాముఖిలో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందడానికి ఎన్నో వనరులు, అవకాశాలు ఉన్నాయని డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి చెప్పారు. ఆర్థిక, పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో విశాఖకు విశిష్ట స్థానం ఉందన్నారు. విశాఖ అభివృద్ధిలో వాల్తేరు డివిజన్ కీలక పాత్ర పోషిస్తోందని, జోనల్ రైల్వేలో ఇదొక ఆశాకిరణమని పేర్కొన్నారు. పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు అవసరమైన తోడ్పాటును రైల్వే అందజేస్తుందని, దానిని వినియోగించుకుని వ్యాపారాభివృద్ధి చెందాలని కోరారు. శుక్రవారం రాత్రి ఓ హోటల్లో విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (వీసీసీఐ) నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవేత్తల సందేహాలకు సమాధానమిచ్చారు. కొత్తవలస–కిరండోల్ డబ్లింగ్, విజయనగరం–రాయగడ ట్రిప్లింగ్ లైన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సరకు రవాణా వేగం పుంజుకుంటాయన్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో రూ.640 కోట్ల విలువైన మూడు కొత్త ప్రాజెక్టులకు రైల్వే బోర్డు నుంచి అనుమతులు లభించాయని తెలిపారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో అదనంగా రెండు ప్లాట్‌ఫాంలు నిర్మిస్తామని, దువ్వాడ–సింహాచలంల మధ్య రెండు కొత్తలైన్లు ఏర్పాటవుతాయని, పెందుర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. ఇవి అందుబాటులోకి వస్తే రైల్వే సేవల్లో పలు మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. విశాఖకు ఐసీఎఫ్ నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలను 70 శాతం వరకు మార్పు చేశామని తెలిపారు. స్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా విశాఖ రైల్వేస్టేషన్ వద్ద మల్టీలెవల్ పార్కింగ్ అందుబాటులోకి వస్తుందని, దీంతో పార్కింగ్ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. తొలుత ఎంటర్‌ప్రెన్యూర్ మ్యాగజైన్‌ను డీఆర్ఎం ఆవిష్కరించారు. వీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్. సతీష్, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సత్పతి

కనువిందుగా బ్రహ్మకమలం



జి.మాడుగులలోని పాకలసాటి గురుదేవుల ఆలయ సన్నిధిలో బ్రహ్మకమలం విరబూసింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఇక్కడ రెండో సారి పూసినట్టుగా వారు తెలిపారు.

- జి.మాడుగుల

అప్పన్న నిజరూప దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



సింహగిరిపై సింహాద్రినాథుడి నిజరూప దర్శనానికి సమయం ఆసన్నమైంది. ఇందుకు సంబంధించి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

II లో

క్లుప్తంగా

గిరి దుర్గాభవానీకి అష్టోత్తర పూజ



అడ్డతీగల: చైత్ర మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా స్థానిక పవనగిరి క్షేత్రంలో గిరి దుర్గా భవానీ అమ్మవారికి అష్టోత్తర పూజ నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఖడ్గమాల విజయదుర్గా మంత్ర సంపుటీకరణతో కుంకుమపూజ చేశారు. తొలుత సదానంద సరస్వతి స్వామీజీకి అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం గణపతి కవచంతో పూజాధికాలు ఆరంభించారు. ఈ పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

26న ఐటీఐలో జాబ్‌మేళా

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన షిర్డీసాయిబాబా ఎలక్ట్రికల్ కంపెనీలో ఉద్యోగాలకు ఐటీఐ ఎలక్ట్రికల్, ఫిట్టర్, వెల్డర్, మోటార్ మెకానిక్, మెకానికల్, డీజిల్ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు అర్హులన్నారు, ఆసక్తిగలవారు ఉదయం 10 గంటలకు అని రకాల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

అప్పన్న నిజరూప దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

- ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సర్వదర్శనాలు
- సాధారణ భక్తులకు పెద్ద పీట
- రాత్రి 7 గంటలకు సింహగిరిపై క్యూ ప్రవేశ గేట్లు మూసివేత
- అప్పటి వరకు క్యూల్లో ఉన్నవారందరికీ దర్శనాలు
- ప్రొటోకాల్ వీఐపీలకు ఉదయం రెండు స్లాట్లలో దర్శనాలు
- లక్ష యాభై వేల మంది భక్తులు వస్తారని అంచనా



సింహాచలం : వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని ఏడాదంతా చందనం మణుగుల్లో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రినాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమవుతోంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకునేందుకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే సాధారణ భక్తులకే పెద్ద పీట వేస్తూ వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ మల్లికార్జున, సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు సారథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. 1.50 వేల మంది భక్తులు చందనోత్సవానికి వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది.

ఒంటిగంట నుంచి వైదిక కార్యక్రమాలు ప్రారంభం

చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సుప్రభాతసేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేస్తారు. అనంతరం వెండి బొరుగులతో స్వామిపై ఉన్న చందనాన్ని తీసి నిజరూపభరితుడ్ని చేస్తారు. తెల్లవారుజామున 3.30గంటలకు తొలిదర్శనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు అందిస్తారు. 3.30గంటల నుంచి 4గంటల వరకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ వారిచే సంప్రదాయ వస్త్ర సమర్పణ ఉంటుంది. రాత్రి 8.30గంటల నుంచి సహస్రఘటాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 11గంటల నుంచి శీతలోపచారాలు, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహణ అనంతరం తొలవిడతగా మూడు మణుగుల చందాన్ని స్వామికి సమర్పించి మళ్లీ నిత్యరూపభరితుడ్ని చేస్తారు.

ఏర్పాట్లు ఇలా...

- తెల్లవారుజామున 4 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుంది. రాత్రి 7గంటలలోపు క్యూలైన్లలోకి భక్తులను అనుమతిస్తారు.
- ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు, తిరిగి ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు రెండు స్లాట్లలో ప్రొటోకాల్ వీవీఐపీలకు దర్శనం కల్పిస్తారు.
- సింహగిరిపైకి కేవలం డ్యూటీ పాస్‌లు ఉన్న వాహనాలను, ప్రొటోకాల్ వీఐపీ వెహికల్ పాస్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- పాత అడవివరం జంక్షన్, గురుకుల పాఠశాల, పాత గోశాల జంక్షన్ వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో చలివేంద్రాలు, లైటింగ్, టెంట్లు, కార్పెట్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.
- శనివారం సాయంత్రం 6 గంటల నుంచి కొండపైకి ప్రవేటు వాహనాలను అనుమతించరు.
- ఆదివారం ఉదయం 3గంటల నుంచి పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌ల నుంచి దేవస్థానానికి చెందిన నాలుగు బస్సులతోపాటు, దేవస్థానం అద్దె చెల్లించిన 56 ఆర్టీసీ బస్సుల్లో భక్తులను ఉచితంగా సింహగిరికి చేరుస్తారు. సాయంత్రం 6 గంటలతో బస్సులను నిలిపివేస్తారు. ఖాళీ బస్సులను మాత్రమే కొండపైకి పంపిస్తారు.
- ప్రొటోకాల్, వీవీఐపీ భక్తులు కృష్ణాపురం గోశాల వద్ద వాహనాలు పార్క్‌చేయాలి. అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన మినీ బస్సుల్లో రెండో ఘాట్ రోడ్డు ద్వారా సింహగిరికి చేరుస్తారు. రూ.1500 టికెట్టుపై వచ్చే భక్తుల కోసం అడవివరంలోని రెసిడెన్షియల్ స్కూల్, రూ.1000 టికెట్లపై వచ్చే భక్తులకు రెండో ఘాట్‌రోడ్డు జంక్షన్, పాత గోశాల జంక్షన్, రూ.300 టికెట్లపై వచ్చే భక్తులు శొంఠ్యాం రోడ్డు, న్యూ టోల్‌గేట్ ఏరియా, కొండదిగువ బస్టాండ్, పాత గోశాల జంక్షన్‌ల వద్ద వాహనాలు పార్క్‌చేసి బస్సుల్లో సింహగిరికి చేరుకోవాలి.
- ఈసారి ప్రసాదాల విక్రయాన్ని కొండదిగువకు మార్పు చేశారు. పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్ వద్ద ప్రసాదాల విక్రయాలు జరుపుతారు.
- శనివారం సాయంత్రం 4గంటల వరకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి భక్తులను అనుమతిస్తారు. ఆ తర్వాత ఖాళీ బస్సులను కొండపైకి పంపించి కొండపై ఉన్న భక్తులను కొండదిగువకు చేరుస్తారు.
- సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్టుపై వచ్చేభక్తులందరికీ ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనాన్ని కల్పిస్తారు. వీరికి కూడా దర్శన సమయాలను సూచిస్తూ స్లాట్లను పెట్టారు.
- చందనోత్సవంనాడు దివ్యాంగులకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ప్రత్యేక దర్శన సమయం కేటాయించారు.
- ఒకేసారి 27వేల 200మంది భక్తులు వేచిఉండేలా సింహగిరిపై దర్శనాల క్యూలను రూపొందించారు. 12వేల మంది భక్తులు వేచి ఉండేలా 18వేల రన్నింగ్‌ఫీట్ (5కిమీ) మేర ఉచిత దర్శనం క్యూ ఏర్పాటు చేశారు. అలాగే 9వేల మంది భక్తులు వేచి ఉండేలా రూ.300 టికెట్టు క్యూ లైన్ను 13వేల ఆర్‌ఎఫ్‌టీ(3.9 కిమీ)మేర ఏర్పాటు చేశారు. అలాగే 5,500 మంది భక్తులకు సరిపడా 8వేల ఆర్‌ఎఫ్‌టీ(2.4కిమి) మేర రూ.1000 దర్శనం టికెట్టు క్యూ ఏర్పాటు చేశారు. అలాగే ఏడువందల మంది వీవీఐపీలకు సరిపడా 1000 ఆర్‌ఎఫ్‌టీ(0.3కిమీ) మేర రూ.1500 టికెట్ క్యూని ఏర్పాటు చేశారు.
- ఉచిత దర్శనం క్యూ, రూ.300 టికెట్టు సింహగిరిపై ఉన్న బస్టాండ్ నుంచి ప్రారంభమవుతాయి. రూ.1000 టికెట్ క్యూ మేహెల్ప్ యు కేంద్రం వద్ద నుంచి ప్రారంభమవుతుంది. రూ.1500 క్యూ పాత పీఆర్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమవుతుంది.
- భక్తులకు నీడ కల్పించేందుకు సింహగిరిపై మాడ వీధిల్లోను, బస్టాండ్‌లోను, ఉత్తర రాజగోపురం ఎదురుగాను 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీవ షీట్లతో షెడ్లులను వేశారు.
- కొండపైన ప్రస్తుతం ఉన్న 82 పర్మినెంట్ మరుగుదొడ్లుతో పాటు 75తాత్కాలిక మరుగుదొడ్లు, కొండదిగువ పాత అడవివరం జంక్షన్, గోశాల జంక్షన్ తదితర ప్రదేశాల్లో మరో 55 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- క్యూల్లో మంచినీరు, మజ్జిగ విరివిగా అందించే ఏర్పాటు చేశారు.
- దర్శనానంతరం అన్నప్రసాద భవనం వద్ద కదంబం, దద్దోజనం, చక్కెర పొంగలిని 50 వేలమందికి అందించే ఏర్పాటు చేశారు.
- భక్తులకు సేవలందించేందుకు 70 వరకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి.
- సింహగిరిపైన, కొండదిగువన కలిపి మొత్తం ఆరు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఐదు అంబులెన్స్, 108 వాహనాలను, దేవస్థానానికి చెందిన అంబులెన్స్ అందుబాటులో ఉంచుతున్నారు.

సమాచారం కోసం ఫోన్ నంబర్లు

చందనోత్సవం సమాచారం కోసం సింహగిరిపై సమాచారకేంద్రం నంబర్ 0891-2784949, కొండదిగువ సమాచార కేంద్రం 0891-275666లలో సంప్రదించవచ్చు.



సింహగిరిపై ఏర్పాటు చేసిన దర్శన క్యూలు



కలశాలను సిద్ధం చేస్తున్న వైదికులు

23 నుంచి బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్, పర్సనల్ కాంటాక్ట్ తరగతులు, వార్షిక పరీక్షలను ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వర రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాలలో వీటిని నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం బాలుర ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు శ్రీకాకుళం హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో, విశాఖపట్నం బీవీకే కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షలకు హాజరు కావాలన్నారు.

మార్నింగ్ వాక్‌లో ప్రముఖులు



ముచ్చటిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లక్ష్మీనారాయణ

బీచ్‌రోడ్డు: సాగరతీరంలోని శుక్రవారం మార్నింగ్ వాక్‌లో ప్రముఖులు సందడి చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మార్నింగ్ వాక్ చేస్తూ బీచ్‌లోని వాకర్స్‌ను పలకరించారు. ఈ సందర్భంగా ఇద్దరు కాసేపు ముచ్చటించారు.

27న మామిడి, జీడి ఫలసాయ వేలం

కూనవరం: పైదిగూడెం ఐటీడీఏ ఫాంలో మామిడి, జీడి ఫలసాయంపై ఈ నెల 27న వేలం నిర్వహించనున్నట్లు చింతూరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సూరజ్ ధనుంజయ్ గనోరె శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే వారు ఈ నెల 26లోపు వెయ్యి రూపాయల ధరావత్తుగా చెల్లించాలని సూచించారు. వేలం పాట ఖరారైన వెంటనే మొత్తంలో 25 శాతం చెల్లించాలని, మిగిలిన 75 శాతం సొమ్ము వారం రోజుల్లో ఐటీడీఏ ఖాతాలో జమ చేయాలని సూచించారు.

తునికాకు కట్ట ధర పెంచాలి

ఎటపాక: తునికాకు కట్ట రేటును పెంచి కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాల్లో తునికాకు కట్ట ధర రూ.6 చెల్లిస్తుండగా, మన రాష్ట్రంలో నాణ్యమైన ఆకు సేకరణ చేస్తున్నప్పటికి తక్కువ ధర ఇస్తున్నారని వాపోయారు. కార్మికులకు బోనస్ చెల్లించాలని, వడదెబ్బ, పాముకాటుకు గురైన వారికి ప్రమాద బీమా కల్పించాలని కోరారు.

అంతుచిక్కని వ్యాధితో మూగజీవాల మృతి



గొర్రె కళేబరాన్ని చూపిస్తున్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ ఈతరొబ్బలు గ్రామంలో మాతే రమేష్ అనే గిరిజన రైతుకు చెందిన పాడి పశువులు, గొర్రెలు అంతుచిక్కని వ్యాధితో చనిపోతున్నాయి. దాంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుని, మూగజీవాల మరణానికి కారణం తెలుసుకుని నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

నేడు గురుకులం ప్రవేశ పరీక్ష

జి.మాడుగుల: గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలు, కళాశాలల్లో 8వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి శనివారం ఉదయం పరీక్ష నిర్వహించనున్నట్లు గురుకులం కళాశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ పారయ్య శుక్రవారం తెలిపారు. అరకు, పాడేరు బాలికల గురుకులం పాఠశాల, కళాశాలల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



కాలిన గాయాలతో బేబీరాణిని

రాజవొమ్మంగి: మండలంలోని నెల్లిమెట్లలో వివాహిత తాము బేబీ రాణి (30) శరీరంపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు 108లో లాగరాయి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్ తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



సర్భాపురంలో కరపత్రాలు అందిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

మారేడుమిల్లి: ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దొరచింతలపాలెం పంచాయతీ పరిధి దొరచింతలపాలెం, దారవాడ, శ్రీపురం, సర్భాపురం, పెద్దూరు గ్రామాల్లో శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ఆయా గ్రామాల్లో 350 గడపలను సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధుల వద్దకు ప్రజలు వెళ్లే వారన్నారు. ఇప్పుడు సీఎం జగనన్న పాలనలో ఆ సమస్య లేదన్నారు. ప్రజల వద్దకు ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చి సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో అశోక్‌కుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, మండల యూత్ అధ్యక్షుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), నాయకులు బలుసుమిల్లి చంటి, దూడ స్మిత్, సోమిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

నేడు బోర్నగూడెంలో గడప గడపకు...

రాజవొమ్మంగి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి చెరకుంపాలెం సచివాలయ పరిధి సంజీవనగరం, బోర్నగూడెం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరు కానున్నారని, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన ఉపాధ్యాయుల పదోన్నతులపై వినతి



పీవో సూరజ్ గనోరేతో చర్చిస్తున్న సంఘం నాయకులు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఆదివాసీ (గిరిజన) సాంస్కృతిక, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంగల శ్రీనువాసు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చవలం శుభకృష్ణ, మాజీ అధ్యక్షుడు సోళ్ల బొజ్జిరెడ్డి, కార్యదర్శి కత్తుల కృష్ణారెడ్డి, బొరగ గంగరాజులు కోరారు. శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేను కలిసి విన్నవించారు. రాజవొమ్మంగి జీహెచ్ఎస్‌లో ఖాళీ అవుతున్న గ్రేడ్ –2 హెచ్ఎం పోస్టును కౌన్సెలింగ్ పద్ధతిలో భర్తీ చేయాలన్నారు. గతేడాది గెజిటెడ్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు ప్రమోషన్‌లు ఇవ్వాల్సి ఉండగా, కోర్టు ఆర్డర్ తెచ్చుకున్న గిరిజనేతరులకు మాత్రమే కల్పించారని తెలిపారు. పూర్తి స్థాయిలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఏజెన్సీలో విద్య కుంటుపడుతుందని వాపోయారు. వీటిపై పీవో స్పందిస్తూ మే మొదటి వారంలో పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



బాబూరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు

పాడేరు రూరల్: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పాడేరుకు చెందిన మోదా బాబూరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను శుక్రవారం పాడేరులో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కె. భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, ఏఎంసీ డైరెక్టర్ లకే రామసత్యవతి, పాడేరు నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ అల్లాడ నాగేష్, నాయకులు కొట్టగుల్లి చిన్ని, లకే శ్రీను పాల్గొన్నారు.